ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు

సోమవారం 20 అక్టోబరు 2025

దీపావళి వెలుగులు నింపాలి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల జీవితాల్లో దీపావళి వెలుగులు నింపాలని కలెక్టర్ ఏ.సిరి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి నిర్వహిస్తారన్నారు. పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, సురక్షితంగా పండుగ చేసుకోవాలని సూచించారు.



ఆనందాల డోలిక..
వెలుగుల వేడుక
నేడు దీపావళి



కర్నూలు కల్చరల్/ నంద్యాల కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆనందాల డోలిక.. వెలుగుల వేడుక దీపావళి. ఇంటిల్లిపాది ఉత్సాహంగా జరుపుకునే సంబరం. ముచ్చటగా రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకలో ఆదివారం నరక చతుర్దిని నిర్వహించారు. సోమవారం దీపావళిని ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఏటా ఆశ్వయుజ అమావాస్య రోజున చీకట్లను పారదోలుతూ, లోకాన వెలుగులు నింపుతూ వేడుకను జరుపుకుంటారు. చెడుపై మంచి సాధించే విజయానికి ప్రతీకగా సంబరాలను నిర్వహించుకుంటారు. కొత్త పద్దులు సిద్ధం చేసుకొని, లక్ష్మీపూజలకు వ్యాపారులు సమాయత్తమవుతున్నారు. దీపావళికి నోములు నోచుకుకోడానికి సిద్ధమయ్యారు.


మిగతా 6వ పేజీలో













ఆనందాల డోలిక.. వెలుగుల వేడుక

(5వ పేజీ తరువాయి)

'దీపేన సాధ్యతే సర్వం' అని శాస్త్ర వచనం. 'దీపంతో దేనినైనా సాధించొచ్చు'అని దీని సారాంశం. నిత్యం ఉదయం, సాయంత్రం సంధ్య వేళల్లో ఇంట్లో వెలిగించిన దీపాలు ఐశ్వర్యకారకంగా నిలుస్తాయని ధార్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏదైనా కోరిక తీరాలంటే ఒక దీపాన్ని వెలిగించి, ఫలం, పుష్పాలు సమర్పించి, ఇష్టదేవతకు నమస్కరిస్తే చాలని పురాణాలు పేర్కొంటాయి. దీపమున్న చోట దేవతలు నివసిస్తారని దీపావళి రోజున ఇళ్లల్లో దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని స్వాగతిస్తారు.

శ్రీమహాలక్ష్మికి ప్రీతికరమైన వేడుక

దీపావళి రోజు దీపలక్ష్మి తన కిరణాలతో అమావాస్య చీకట్లను పారదోలి, జగత్తును తేజోవంతం చేస్తుంది. అందుకే దీపావళి నాడు సర్వ శుభాలు, సంపదలు ప్రసాదించే లక్ష్మీదేవిని పూజించడం మన సంప్రదాయం. లక్ష్మీదేవి దీపజ్యోతిగా, జ్యోతిని లక్ష్మి మూర్తిగా భావించి దీపావళి రోజున దీపాలు వెలిగించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

నరకాసురుడిని వధించిన సందర్భంగా..

లోక కంటకుడైన నరకాసురుడిని సత్యభామ వధించడం, ముల్లోకాలను గడగడలాడించిన లంకాధిపతి దశకంఠుడ్ని శ్రీరాముడు జయించిన సందర్భంగా ప్రజలు ఆనందంగా దీపాలు వెలిగిస్తూ, బాణసంచా కాలుస్తూ సంబరంగా దీపావళి వేడుక నిర్వహించారనేది పౌరాణిక ప్రాశస్త్యం. కౌరవులు సాగించిన మాయా జూదంలో ఓడిన పాండవులు పదమూడేళ్ల అరణ్యవాసం, ఏడాది అజ్ఞాత వాసం ముగించుకొని తమ రాజ్యానికి తిరిగి వచ్చిన సందర్భంగా దీపాలు వెలిగించి ప్రజలు దీపావళి జరుపుకొన్నారని భారతంలో ఉంది.

దీపావళికి ప్రాముఖ్యత ఉంది

దీపావళి పండుగకు వైజ్ఞానికంగా మానవ సమాజానికి మేలు చేసే ఎంతో ప్రాముఖ్యత ఉంది. అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి, జ్ఞానం అనే దీపాన్ని వెలిగించుకొని ప్రతి వ్యక్తి జీవితంలో ముందుకు పోవాలనే అర్థం ఇందులో ఉంది. ఈ వేడుకలో దీపాల అలంకరించడంతో వచ్చే వెలుగు మానసిక ఆనందాన్ని కలిగిస్తే, దీపాల వెలుగుతో పాటు బాణసంచా వెలుగుతో వచ్చే కాంతి మనసులో భయాలను దూరం చేస్తుంది.

● దేవెళ్ల సాయినాథ శర్మ, వేద పండితుడు

దుకాణాలు కిటకిటలాడుతున్నాయి

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో టపాసుల దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఆనందాల దీపావళిని అప్రమత్తంగా జరుపుకోవాలని పలువురు అధికారులు, తదితరులు సూచిస్తున్నారు. టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

మరణంలోనూ వీడని బంధం

భార్య మృతితో ఆగిన భర్త గుండె

ప్యాపిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడి వయసు 93 ఏళ్లు.. వృద్ధురాలి వయసు 83 ఏళ్లు. వృద్ధాప్యంలో కూడా దంపతులిద్దరూ ఒకరికొకరు తోడుగా ఉంటూ జీవనం సాగించేవారు. అయితే వయస్సు మీద పడటంతో పాటు అనారోగ్యం తోడు కావడంతో భార్య మృతి చెందింది. భార్య మరణ వార్త విని భరించలేక భర్త కూడా మృతి చెందారు. ఈ విషాద ఘటన ఆదివారం నంద్యాల జిల్లా ప్యాపిలి పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన ఆర్వేటి లక్ష్మీనారాయణ (93) గ్రంథాలయం అధికారిగా పని చేసి 33 ఏళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. ఆయన భార్య వెంకటలక్ష్మమ్మ (83) గృహిణి. ఈ దంపతులకు నలుగురు కుమారులు ఉన్నారు. వీరిలో ఇద్దరు కొడుకులు అనారోగ్యంతో మృతి చెందారు. ఒక కుమారుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నారు. పట్టణంలో ఉంటున్న మూడో కుమారుడు దగ్గర వృద్ధ దంపతులు ఉంటున్నారు. నిద్రలోనే భార్య మరణించిన విషయం తెలిసిన కొద్ది గంటలకే భర్త కూడా తుదిశ్వాస వదిలారు.



లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మమ్మ దంపతులు (ఫైల్)

విరిజాజి సిరులు



చాగలమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వెలుగులు తెచ్చినట్లే జాజిపూలు సాగు చేసిన రైతులకు సిరులు కురిపిస్తోంది. వారం కింద విరి జాజులు కేజీ రూ.170 పలుకగా పండుగ సందర్భంగా ఒక్కసారిగా రూ.800కు పెరిగింది. ఆదివారం జాజిపూలు కేజీ రూ.800, మల్లెలు కేజీ రూ.700లకు చేరాయి. దిగుబడి కూడా తక్కువగా ఉండటంత జాజి, మల్లె ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ధరలు అధికంగా పలకడంతో రైతులకు దాదాపు రూ. లక్షల్లో ఆదాయం వచ్చింది. కౌలు రైతులకు కూడా కౌలుపోను రూ.లక్ష దాకా ఆదాయం వచ్చింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన మా బాషా, షరీఫ్, పక్రుద్దీన్, మరి కొందరు రైతులు మల్లె పూల సాగులో రికార్డు సాధించి ఆదర్శంగా నిలిచారు. కష్టానికి తగ్గ ఫలితం వచ్చిందని కౌలు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పండుగ పూట ప్రత్యేక రైళ్లు

మద్దికెర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంతకల్లు డివిజన్ మీదుగా సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగుళూరు కంటోన్మెంట్ నుంచి ఈ నెల 21, 22, 23 తేదీల్లో గుంతకల్ మీదుగా కలబురిగి, ముజఫర్‌నగర్‌కు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు తెలిపారు

రేపు కడప ఆర్డీ కార్యాలయం వద్ద ధర్నా

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో 143ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 21వ తేదీన కడప ఆర్డీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలుగు నాడు వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ. మాధవరాజు ఓ ప్రకటనలో తెలిపారు. జీవోతో వివిధ రకాల సూపర్‌వైజర్ పోస్టులు రద్దు కావడంతో పదోన్నతులు కోల్పోతారన్నారు.

బాధితులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

కర్నూలు రూరల్ అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. నియోజకవర్గానికి చెందిన పదిమంది బాధితులకు ఆదివారం రూ.6లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

యువత దేశభక్తిని పెంచుకోవాలి



రామచంద్ర ప్రభును సన్మానిస్తున్న రోపా ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యువత దేశభక్తిని పెంచుకోవాలని, ఉన్నత విద్యతో సమాజానికి సేవ చేయాలని తులసి సీడ్స్ గ్రూప్ ఛైర్మన్ తులసీ రామచంద్ర ప్రభు సూచించారు. ఆదివారం నగరంలోని జడ్పీ సమావేశ హాలులో రోపా, ఎస్‌కేడీఏఎఫ్‌పీయూపీటీ సంయుక్త ఆధ్వర్యంలో బలిజ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దనరెడ్డి హాజరయ్యారు. మొత్తం 180 మందికి రూ.9లక్షల ఉపకార వేతనాలు ఇచ్చామన్నారు. బలిజ సంఘం నాయకులు కోనేటి చంద్రబాబు, యర్రంశెట్టి నారాయణరెడ్డి, రోపా అధ్యక్షుడు చింతలపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కోనేటి వెంకటేశ్వర్లు, కోశాధికారి అంచ పెద్దస్వామి, బలిజ సంఘం నాయకులు కొట్టే చెన్నయ్య, బాలరాజు, భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి



టీజీ దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి శిక్షణ ఉపయోగించుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ సూచించారు. ఆదివారం నగర శివారు కల్లూరులోని వాసవీ భవన్‌లో టీజీ లక్ష్మీ వెంకటేశ్ వాసవి మహిళ శిక్షణ కేంద్రాన్ని టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ట్రస్టు ఛైర్మన్ చిలమకూరు రాజశేఖర్ ఆధ్వర్యంలో టీజీ వెంకటేశ్ దంపతులను సన్మానించారు.

సంబరాల్లోనూ కాసుల వేట

● వ్యాపారుల సిండికేట్.. ఆకాశన్నంటిన బాణసంచా ధరలు



కర్నూలులో బాణసంచా విక్రయాలు

కర్నూలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంబరాల్లోనూ కాసుల వేట మొదలు పెట్టారు కొందరు స్వార్థపరులు. తాత్కాలిక లైసెన్స్‌ల కోసం కొందరు వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఇదే అవకాశంగా కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనుమతులు ఇవ్వాలంటే పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉంటుంది. అదీకూడా రాజకీయ నాయకుల నుంచి సిఫార్సులు వస్తేనే ఎన్‌వోసీ జారీ చేస్తున్నారు.

ఒక్కో షాపునకు ఒక్కో రేటు..

ఒక్కో షాపుకు ఒక్కోరేటు చొప్పున వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వాస్తవంగా టపాసుల పెట్టెలపై ఉన్న ఎమ్మార్పీ ధరలకు, అమ్మకం ధరలకు సంబంధం ఉండదు. ఉదాహరణకు పూల బాణాలు 10 కడ్డీల బాక్సు ఎమ్మార్పీ రూ.700 ఉంటే రూ.100-150లకు, తౌజండ్‌వాలా బాణాల పెట్టె కంపెనీలను బట్టి ఎమ్మార్పీ రూ.2,500-3,000 ఉంటే రూ.450-500కే ఇస్తున్నారు.

ఎమ్మార్పీ కంటే తక్కువకే ఇస్తున్నామని దబాయింపు..

వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి అసలు ధరకంటే రెట్టింపు ధరలకు విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారు. అధిక ధరలను ప్రశ్నిస్తే ఎమ్మార్పీ కంటే తక్కువకే ఇస్తున్నాం కదా అని దబాయిస్తున్నారు. వ్యాపారులందరికీ అనుమతి ఇస్తే వారిమధ్య పోటీ పెరిగి సరియైన ధరలకు అమ్ముతారు, దీంతో ప్రజలపై భారం తగ్గుతుంది. బాణసంచా అమ్మకాలు మొదలు ప్రభుత్వ శాఖల ఎన్ఓసీలు, తాత్కాలిక లైసెన్స్‌లు జారీ వరకు కీలక ప్రజా ప్రతినిధి ప్రోత్సాహంతో ఓ నాయకుడు పెత్తనం చెలాయించడం విమర్శలకు తావిస్తోంది.

వాహనం ఢీ.. గుర్తుతెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని క్రిష్ణానగర్ ఫ్లైఓవర్ వద్ద వాహనం ఢీ కొని వ్యక్తి మృతిచెందాడు. కర్నూలు ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు.. సదరు వ్యక్తి శరీన్‌నగర్ నుంచి అవతలివైపుకు రాత్రి 10.40 గంటల ప్రాంతంలో రహదారి దాటుతుండగా బెగుళూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న వాహనం ఢీ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

యువజనోత్సవాలకు ఎంపీకి ఆహ్వానం

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా యువజనోత్సవాలకు ఎంపీ బస్తిపాటి నాగరాజును సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ ఆహ్వానించారు. ఆదివారం పంచలింగాల గ్రామంలోని ఎంపీ స్వగృహంలో ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్ పర్సన్‌ను సన్మానించిన రజక ఉపాధ్యాయులు

ఆదోని టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్ది, సామాజికంగా అభివృద్ధి పథంలో నడిచేలా చేయగల ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి అన్నారు. ఆదివారం ఆదోని తాలూకా రజక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నాగరాజ్ అధ్యక్షతన స్థానిక నేషనల్ హైస్కూల్‌లో, డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన రజక ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ రజకులు ఇటీవల కాలం నుంచి సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా అభివృద్ధిలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఏ సామాజిక వర్గానికి చెందిన వారైనా విద్యాభ్యాసంతోనే మార్పు చెందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నరసింహరాజు, గోవిందప్ప, సాయిబాబా, విరుపాక్షి, మద్దిలేటి, హనుమంతు, దస్తగిరి, రాగన్న, డాక్టర్లు నవీన్, నరేంద్ర, జయలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత

ఆస్పరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 20న మండలంలోని చిగిలి గ్రామంలో గరుసు గుంతలో పడి మృతిచెందిన ఐదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం నుంచి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షలు చెక్కులను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు చేతులమీదుగా ఆదివారం బాధితా కుటుంబాలకు ఎంపీ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ బాధితా కుటుంబాలకు ఎంత ఇచ్చినా పిల్లలను పోగొట్టుకున్న లోటును పూడ్చలేమన్నారు. బాధితా కుటుంబాలకు తోడుగా నిలవడానికి సీఎం చంద్రబాబునాయుడు ఆర్థిక సాయం అందించారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా అనేక సందర్భాల్లో కూటమి సర్కార్ సత్వర సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వ చర్యలపై బాధితా కుటుంబాలు, గ్రామ సర్పంచ్ రాధాకృష్ణ హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా

ఆదోని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండిగిరిలోని పద్మశాలి నగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల సమస్యలను ఉన్నాయని, పరిష్కారం కోసం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి దృష్టికి తీసుకెళ్తానని టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ తెలిపారు. ఆదివారం మండిగిరి కాలనీలోని పద్మశాలి నగర్‌లో దెబ్బతిన్న రోడ్లు, అపరిశుభ్రత వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బియ్యం గోపాల్, బాబురావు, దేవేంద్ర, లక్ష్మీనారాయణ, నాగరాజులతో పాటు కలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో ప్రజలు రోగాలపాలు

మద్దికెర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం తయారు చేసి ప్రజలకు ఇవ్వడంతో రోగాలపాలు అవుతున్నారని జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మద్దికెరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిపై దాడి చేయడం మంచి పద్దతి కాదనీ అన్నారు. తాలుకాలు అభివృద్ధి చేస్తే స్వాగతిస్తామని, అభివృద్ధి చేయకపోతే ప్రశ్నిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పది ప్రభుత్వ మెడికల కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తూ పీపీపీ విధానాన్ని అమలు చేయడాన్ని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఆపాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 16 మెడికల్ కాలేజీలు ఏర్పాటు అయ్యాయన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటిని ప్రైవేటీపరం చేయాలని చూడడం మచిది కాదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుంటే.. కూటమి నాయకులు ఓర్వలేక మహిళ అని కూడా చూడకుండా దాడులకు పాల్పడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్, మాజీ డైరెక్టర్ బత్తిన హరి, తదితరులు ఉన్నారు.

హైకోర్టుఏర్పాటు కోసం పోరాటం

పత్తికొండ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న కర్నూలు నగరంలో జరిగిన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కర్నూలులో హైకోర్టు చేసేందుకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం నిరాశ పరిచిందని దీనిపై పోరాటం చేస్తామని ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, న్యాయవాది సురేంద్రకుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభలో కర్నూలులో హైకోర్టు ఏర్పాటు విషయంపై ప్రకటన చేస్తారని జిల్లా ప్రజలు, న్యాయవాదులు ఆశించారన్నారు. అయితే హైకోర్టు ఏర్పాటు ప్రకటన చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పి 11 ఏళ్లు పూర్తి అయినా నేటికీ హామీ అమలు కాలేదన్నారు. హైకోర్టు ఏర్పాటు కోసం మేధావులు, న్యాయవాదులు, ప్రజా సంఘాలు, ప్రజలు పోరాటాలకు నడుం బిగించాలన్నారు.

దేవరగట్టు చైర్మన్‌గా వీరనాగప్ప



దేవరగట్టు చైర్మన్‌గా నియమితులైన వీరనాగప్పను సన్మానిస్తున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, శివప్రసాద్

ఆలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు మాల మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా కురువ సామాజికవర్గానికి చెందిన వీరనాగప్ప, వైస్ చైర్మన్‌గా లోకేష్ నాయక్‌ను నియమిస్తున్నట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి ప్రకటించారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో దేవరగట్టు చైర్మన్ ఎంపికపై సమావేశం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా చైర్మన్‌లుగా రాజకీయ నాయకుల బంధువులు కొనసాగారు. అయితే ఆలయ పరిసర గ్రామాల భక్తులకు పదవి ఇచ్చేవారు. కాదని, అయితే కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టామన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, విష్ణువర్ధన్ రెడ్డి, శీనప్ప, ప్రకాష్, రాముడు, కురువ బెలగంటి హనుమప్ప, నరసప్ప, వెంకన్న, కొమ్ము రామాంజినేయులు, ముద్దురంగ, మసాల జగన్, గూళ్యం రామాంజనేయులు, సోమశేఖర్, రాజు, గోవింద్, రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

వెల్దుర్తి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి శ్రీ గుడికల్ సద్గురు హుసేన్ పీరా స్వాముల ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు వెల్దుర్తి గురుకుల ప్రధాన కార్యదర్శులు ఆర్.నేతాజిరెడ్డి, గోట్ల శాంతమ్మ, గోట్ల సర్వేశ్వరమ్మ తెలిపారు. శనివారం ఆరాదనోత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరాధనోత్సవాల్లో భాగంగా 20న సోమవారం గంధమహోత్సవం, 21న మంగళవారం ఆరాధన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధనోత్సవాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యు.కామేశ్వరయ్య, నారాయణ, సన్నిధి జ్ఞానేశ్వరయ్య, గోట్ల ఓమేంద్రబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కించపరిచేలా మాట్లాడడం తగదు

● వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు

ఆలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ వాల్మీకి వర్గానికి చెందిన ఎమ్మెల్యే విరుపాక్షిని అవమానించేలా మాట్లాడడం టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతికి తగదని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు వెంకటేష్, వార్డు సభ్యులు వరుణ్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ దేశ ప్రధానిని ఎమ్మెల్యే విరుపాక్షి కలిసి వాల్మీకుల సమస్యలు విన్నవించారని, ఈ విషయంపై టీడీపీ ఇన్‌చార్జి 'తెలుగులో మాట్లాడారా... హిందీలో మాట్లాడారా, ఇంగ్లిష్లో మాట్లాడారా' అని విమర్శలు చేయడం సరి కాదన్నారు. వాల్మీకులపై ఇంత ఓర్వలేని తనం సరి కాదన్నారు. ఇలా వాల్మీకులను కించపరిచి మాట్లాడడం మానుకోవాలని సూచించారు.

ఉద్యోగులకు డీఏ మంజూరు చేయడం హర్షం

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా ఉద్యోగులకు డీఏ మంజూరు చేస్తూ ప్రకటన చేయడం పట్ల ఏపీఎన్‌జీవో అధ్యక్షురాలు ఉషారాణి, ప్రధాన కార్యదర్శి బజారి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఏపీఎన్‌జీవో భవనంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీ ఏర్పాటు చేయడం ఏపీఎన్‌జీవో సభ్యులు లక్ష్మీ, మంజునాథ్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, గౌస్‌పీరా, థామస్, నాగేంద్ర, సురేష్, సౌజన్య, ప్రమీలమ్మ పాల్గొన్నారు

8న ఇండోర్ ఆటల పోటీలు

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలుగు తీసేందుకు నవంబర్ 8న ఇండోర్ ఆటలు పోటీలను నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సైపుల్లా, ప్రధాన కార్యదర్శి మేఘనాథ్ రెడ్డి తెలిపారు. క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, శ్రీధర్ రెడ్డి, రాయచోటి సుబ్బయ్య, సోమశేఖర్ రెడ్డి, పద్మనాభయ్య శెట్టి, సందీప్ రెడ్డి, రాజేష్, షాబీర్ అహ్మద్, హుస్సేన్ భాషా పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులపై దృష్టి సారించాలి

ఆలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్య కోర్సులపై కూడా ఆసక్తి పెంచుకోవాలని హాలహర్వి మండల కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి అన్నారు. ఆదివారం ఆలూరు పట్టణంలోని లలిత ఎంబ్రాయిడింగ్ వర్క్ టైలరింగ్ షాపును విద్యార్థులు సందర్శించారు. ప్రభుత్వం టైలరింగ్ కోర్సులను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ జి.సునీత, నిర్వాహకురాలు లలిత పాల్గొన్నారు.

'అన్ని వర్గాలకు కేఈ కుటుంబం సమన్యాయం'

పత్తికొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ నియోజకవర్గంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్నది కేఈ కుటుంబం మాత్రమేనని టీడీపీ రాష్ట్రకార్యదర్శి తుగ్గలినాగేంద్ర. జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డిలు అన్నారు. ఆదివారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో మండలకన్వీనర్ కడవలసుధాకర్ అధ్యక్షతన పత్రికా విలేకర్ల సమావేశం నిర్వహించారు. క్రిష్ణగిరి మండలం చిట్యాల పర్యటనపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికి ఆగ్రామంలో అల్లర్లు సృష్టించాలనే దురుద్దేశంతోనే మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పర్యటించిందని ఆరోపించారు. తనపూ దాడిజరిగిందని పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆగ్రామంలో ఎలాపర్యటించిందో చెప్పాలన్నారు. వెంకటరాముడు, తిరుపాలు, వెంకటపతి, లోక్‌నాథ్, హోటల్ శ్రీనివాసులు, మనోహర్‌చౌదరి, తిమ్మయ్య చౌదరిలతోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

దేవనకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్మికహక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధకృష్ణ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు రాధకృష్ణ అన్నారు. దేవనకొండలోని వీబీఆర్ పాఠశాలలో సీఐటీయూ ముడోవ మండల సభ నిర్వహించారు. కార్పోరేట్ శక్తులకు ప్రభుత్వాలు వత్తాసు పలకుతుండటంతో, దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. ప్రైవేటీకరణ వలన పనిగంటలు, కనీస వేతనం, పని ప్రదేశాలలో సౌకర్యాలు కల్పించడం లేదన్నారు.

నూతన కమిటీ ఎన్నిక.. సీఐటీయూ మండల నూతన కమీటిని ఏకగ్రావంగా ఎన్నుకొవడం జరిగింది. మండల అధ్యక్షలుగా పాండురంగడు, ఉపాధ్యక్షులుగా నాగేష్‌సుధాకర్, జ్యోతి, మరో పదిమంది కమీటి సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఏబీఎన్ ప్రతినిధిపై దాడి



దాడిలో గాయపడ్డ పక్కీరప్ప

పత్తికొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఏబీఎన్ ప్రతినిధి పక్కీరప్పపై మరో చానల్ ప్రతినిధి లోగోతో దాడిచేయడంతో తలకు గాయాలయ్యాయి. వివరాలివీ.. పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఆదివారం ప్రెస్‌మీట్ నిర్వహించడంతో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. ప్రెస్‌మీట్ ముగించుకుని ఏబీఎన్ ప్రతినిధి పక్కీరప్ప టీడీపీ కార్యాలయం నుంచి బయటకు వెళ్తున్న సమయంలో మరో చానల్‌కు చెందిన రిపోర్టర్ మల్లికార్జున చేతిలో ఉన్న లోగోతో పక్కీరప్పపై దాడి చేశాడు. కాగా అక్కడే ఉన్న పాత్రికేయులు, టీడీపీ కార్యకర్తలు మల్లికార్జునను అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా ఈ దాడిలో పక్కీరప్ప కుడిచెవి వెనుక భాగంలో గాయాలయ్యాయి. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. అనంతరం దాడిపై పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో మల్లికార్జునపై ఫిర్యాదు చేశాడు. కాగా పక్కీరప్పపై దాడిని జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి.

వికాస తరంగిణి ఆదోనిశాఖ ఏర్పాటు

ఆదోని టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిన్న జీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికాస తరంగిణి సంస్థ ఆదోని శాఖను ఏర్పాటు చేశారు. చీఫ్ కో ఆర్డినేటర్‌గా వంకదారు శ్రీనాథ్ గుప్తా ఎంపికయ్యారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజ్ఞా వికాస్ విభాగానికి వంకదారు మమతా శ్రీ, ఆర్థిక విభాగానికి వెంకటేశ్వర్లు, ఆరోగ్య విభాగానికి ప్రతాప్ ఈరన్న శెట్టి, యువత విభాగానికి రాజేష్, పౌర సంబందాల విభాగానికి రాఘవేంద్ర, రత్నయ్యలను సమన్వయ కర్తలుగా నియమిస్తూ సంస్థ సంచాలకులు గుర్తింపు కార్డులను పంపినట్లు తెలిపారు. వికాస తరంగిణి సూచనల మేరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

మద్దికెర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని రాష్ట్ర సీపీఐ కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ మండల సీపీఐ కార్యదర్శి హనుమప్ప 2వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నబీ రసూల్, మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, సుదాకర్, నెట్టికంటయ్య, కోదండ రాముడు, వీరాంజనేయులు, నాగిరెడ్డి ఉన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం

ఆలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తామని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. ఆదివారం ఆలూరుకు చెందిన కురువ మధు అనే క్రీడాకారుడు సెపక్‌తక్రా ఆటలో ఆసియా ఛాంపియన్‌లో పతకం సాధించాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడు మధుని ఆమె అభినందించారు. గోవాలో జరగబోయే జాతీయ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లేందుకు ఆమె తనవంతుగా రూ.10 వేలు సహాయం అందించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆలూరుకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

మద్దికెర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుకాణ యజమానుదారులు నిబంధనల ప్రకారం బాణసంచా విక్రయించాలని అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గూండాల్ నాయక్, ఎస్ఐ విజయకుమార్ నాయక్ అన్నారు. ఆదివారం టపాసు దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టపాసు దుకాణాల్లో పూర్తి స్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. నీరు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. టపాసులు నిల్వ ఉంచుకోకూడదని తెలిపారు. దీపావళి పండుగను ప్రజలు సురక్షితంగా ఆనందగా జరుపుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఇచ్ఛాపురం నుండి హిందూపురం వరకు తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ భాష పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో బస్సు యాత్ర గోడపత్రికలను సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య, పట్టణ కార్యదర్శి వీరేష్ చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు శరత్ కుమార్, రంగస్వామి, థామస్, దస్తగిరి, వీరేష్ పాల్గొన్నారు.

ఇది రైతు ప్రభుత్వం : ఎమ్మెల్యే బీవీ

• రైతులకు సబ్సిడీ డ్రోన్ల పంపిణీ



రైతులకు డ్రోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన ఇరువురు రైతులకు సబ్సిడీపై మంజూరైన డ్రోన్లను పంపిణీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకీకరణను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు 80శాతం రాయితీతో రూ.10లక్షల విలువచేసే డ్రోన్లను అందిస్తున్నారని ఇది రైతులకు ఉపయోగపడుతుందన్నారు. ఉల్లి, పత్తి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. 13 మంది బాదితులకు రూ.6.57లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నందవరం మండలం కనకవీడు టీడీపీ కార్యకర్త చిన్న నరసింహుడు కుటుంబానికి ప్రమాద బీమా పరిహారం రూ.5లక్షలు ఖాతాలో జమ అయిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, బాస్కర్ల చంద్రశేఖర్, ఖాసి వలి, కమ్మ మహేంద్రబాబు, గోపాల్, మాజీ ఎంపీపీ శంకరయ్య పాల్గొన్నారు.

పండుగపూట వలసబాట

కోసిగి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోసిగి నుంచి ఆదివారం దాదాపు 600 కుటుంబాలు వలస బాట పట్టాయి. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పత్తి తీసేందుకు వెళుతున్నట్లు కూలీలు తెలిపారు. పండుగ ఉన్నా ఇక్కడ ఉపాధి లేకపోవడంతో పనికోసం వెళ్లక తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



కోసిగి నుంచి వలసవెళుతున్న కూలీలు

'వలసలను నివారించండి'



కలెక్టర్‌తో రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గంలో వలసలను నివారించాలని మంత్రా లయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి కోరారు. ఆదివారం కర్నూలులో కలెక్టర్ డా.ఎ.సిరిని కలిశారు. నియోజక వర్గ సమస్యలను వివరించారు. సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో పంటలు సాగుచేయలేక రైతు కుటుంబాలు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలసలు నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొంచాల న్నారు. సాగు, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, రహదారులు, హాస్టళ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని విన్నవిం చారు. రామ కృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి ఉన్నారు.

దీపావళి ప్రశాంతంగా చేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రజలు ప్రశాంతంగా చేసుకోవాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు కోరారు. చిన్నారులను బాణసంచాకు దూరంగా ఉంచాలన్నారు. పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.